

ముమ్మరంగా వరి కోతలు

ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా చర్యలు

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న వారం రోజుల్లో జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా వరి కోతలు జరగనున్నాయని, ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులెదురుకాకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం ధాన్యం కొనుగోలు, పిజిఆర్ఎస్ పెండింగ్ ఫిర్యాదుల ప్రగతి, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్, అర్హులైన అందరికీ ఇల్లు, రీసర్వేకు సంబంధించి వెల్ఫేర్‌లో వేయర్పిన సవరణల వంటి అంశాలపై రెవెన్యూ, సివిల్ సప్లయిస్, వ్యవసాయ, సహకార, సర్వే అధికారులతో సమీక్షించారు.

బిసిలకు పింఛన్ ఏదీ..!



- 50 ఏళ్లకే బిసిలకు పింఛన్ అంటూ కూటమి హామీ
- అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచినా ఉలుకుపలుకు కరువు
- ఏలూరు, పశ్చిమలో దాదాపు 20 లక్షల బిసి జనాభా
- చంద్రన్న బీమా కోసం ఐదు వేల బాధిత కుటుంబాలు ఎదురుచూపు
- 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 హామీ అమలెప్పుడో
- నిరుద్యోగ భృతిపై నోరువిప్పని అధినేతలు
- హామీల అమలు తీరుపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలును పూర్తిగా మరిచిపోయిన పరిస్థితి. కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన ముఖ్యమైన హామీల్లో 50 ఏళ్ల నిండిన బిసిలకు పింఛన్ వర్తింపు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా బిసిలకు ఇచ్చిన పింఛన్ హామీపై మాత్రం నోరు మెదపడం లేదు. దీంతో బిసి తరగతిలో పింఛన్ అమలుపై తీవ్రమైన చర్చ సాగుతున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో మొత్తం జనాభా 20 లక్షలు వరకూ ఉండగా అందులో బిసి జనాభా పది లక్షల వరకూ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో అదేవిధంగా బిసి జనాభా ఉన్నారు. 2024 ఎన్నికల్లో బిసిల ఓట్లను కొల్లగొట్టేందుకు కూటమి నేతలు పలు హామీలు గుప్పించారు. 50 ఏళ్లు నిండిన బిసిలకు రూ.నాలుగు వేల పింఛన్ వర్తింపజేస్తామన్నారు. దీంతో బిసి సామాజిక తరగతి గంపగుత్తగా పెద్దఎత్తున కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసిన పరిస్థితి ఉంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను కూటమి గెలుచుకోగలిగింది. అప్పట్లో కూటమి పార్టీలు బిసిలకు ఇచ్చిన హామీని తిప్పికొట్టేందుకు వైసిపి నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాల్లో బిసి అభ్యర్థులను నిలబెట్టింది. అయినప్పటికీ బిసి తరగతి అంతా కూటమి అభ్యర్థుల వైపే మొగ్గుచూపారు. పింఛన్ పథకాన్ని మాత్రం కూటమి సర్కార్ ఇప్పటి వరకూ అమలు చేయలేదు. అందుకు సంబంధించిన ప్రక్రియను సైతం ప్రారంభించని పరిస్థితి ఉంది. ఎప్పటికి అమలు చేస్తారో తెలియని పరిస్థితి. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ పథకం అమలుపై బిసి తరగతి అంతా ఎదురుచూస్తోంది.

సామాన్యులకు అండనిచ్చే చంద్రన్న బీమా అమలుపై నిర్లక్ష్యం ★★★

ఏదైనా కుటుంబంలో ఇంటి పెద్దను కోల్పోతే చంద్రన్న బీమా అమలు చేస్తామని కూటమి సర్కార్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. 2014 నుంచి ఈ పథకం అమల్లో ఉంది. వైపిపి ప్రభుత్వంలోనూ వైఎస్ఆర్ బీమా పథకంగా కొనసాగింది. సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణాలకు రూ.పది లక్షలు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ప్రతియేటా జిల్లాలో మూడు వేలకుపైగా మరణాలు బీమా పరిధిలోకి వస్తున్నాయి. ఎన్నికల ముందు మార్చి నెల నుంచి ఈ పథకం నిలిచిపోయింది. కూటమి సర్కార్ కొలువుదీరిన తర్వాత చంద్రన్న బీమా అమలు జరుగుతుందని అంతా ఆశించారు. ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ అతీగతీ లేకుండాపోయింది. దీంతో దాదాపు ఐదువేల బాధిత కుటుంబాలు ఈ బీమా కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం చంద్రన్న బీమాను అమలు చేయాలని అంతా కోరుతున్నారు.

మహిళలకు నెలకు రూ.1500 హామీ ఏమైనట్లో..? ★★★

తాము అధికారంలోకి వస్తే 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ ఆ ఊసే లేకుండాపోయింది. రెండు జిల్లాల్లో మహిళల జనాభా 20 లక్షల వరకూ ఉంది. ఇందులో 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు పెద్దసంఖ్యలోనే ఉన్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన హామీపై మహిళల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పథకాలు అమలు చేస్తే జనం నమ్మే పరిస్థితి ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిరుద్యోగ భృతి అమలుకు నోచుకునేనా?.. ★★★

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక యువతకు 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని, అప్పటి వరకూ రూ.మూడు వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతి గురించి ప్రభుత్వం నోరు విప్పలేదు. దీంతో నిరుద్యోగ భృతి అందజేతపై యువతలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. రెండు జిల్లాల్లో నిరుద్యోగులు వేల సంఖ్యలో ఉన్నారు. భృతి అందిస్తే నిరుద్యోగులకు కొంత ఊరటనిచ్చే అవకాశమున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలి

గృహ, వ్యవసాయ, విద్య రుణాలపై దృష్టి కేంద్రీకరించాలి

జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగరాణి


వార్షిక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పిఎసి ఛైర్మన్, అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు అందజేసి వారి ఆర్థిక పురోగతికి సహాయపడాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గృహ, వ్యవసాయ, విద్య రుణాల మంజూరులో బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సిసిఆర్‌సి కార్డులు కలిగిన కౌలు రైతులకు, పశుకిసాన్ కార్డుదారులకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పిఎం స్వనిధి పథకం కింద బ్యాంకర్లు వీధి వ్యాపారులకు మానవతా దృక్పథంతో రుణాలు అందించాలని కోరారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం, జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశం (బ్యాంకర్ల సమావేశం) కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఆర్‌సి కార్డుల మంజూరు, పశుకిసాన్, ఎస్‌హెచ్‌జి, ఎంసిపి, పిఎం స్వనిధి, పిఎం ఇజిపి, వీవర్స్ ముద్ర యోజన, పిఎం విశ్వకర్మ, సూర్యఘర్, విద్యా రుణాలు తదితర అంశాల ప్రగతిపై కలెక్టర్ బ్యాంకర్లతో సమీక్షించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నిర్దేశించిన లక్ష్యాలను నూరుశాతం సాధించడంపై రీజినల్ మేనేజర్ శ్రీదేవిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. బ్యాంకులు లబ్ధిదారులకు అందించిన రుణాల ప్రగతిపై ప్రతివారం నివేదికలు అందజేయాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. పిఎంఇజిపి, పిఎంఎఫ్‌ఎంఇ రుణాల మంజూరులో దరఖాస్తులు వచ్చిన వెంటనే మంజూరు చేసి యూనిట్ల స్థాపనకు సహకరించాలని కోరారు. విశ్వకర్మ పథకం కింద రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలన్నారు. పిఎం సూర్యఘర్ రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు రుణాలు మంజూరులో బ్యాంకులు శ్రద్ధ చూపడం లేదన్నారు. ఈ సందర్భంగా మెప్మా 'అవని' వార్షిక సంచికను ఆవిష్కరించారు. లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ వి.సత్యనారాయణ, నాబార్డు డిడి నిష్యంత్ చంద్ర, ఆర్‌బిఐ ప్రతినిధి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఎ.అప్పారావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జవ్వార్ హుస్సేన్, మెప్మా అధికారి హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులివ్వాలని ఆందోళన




నినదిస్తున్న సిపిఎం నేతలు, ప్రజలు

ప్రజాశక్తి - నరసాపురం

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులను కేటాయించి ప్రయివేటీకరణను ఆపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులను, ఉద్యోగులను అవమానిస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి అని పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిస్సిగ్గుగా కార్మికులు, ఉద్యోగులు పని చేయకుండా ఫ్యాక్టరీని నష్టాల పాల్జేస్తున్నారనడం దారుణమన్నారు. ఈ పద్ధతి సరైంది కాదన్నారు. దేశంలో సొంత గనులు లేకుండా గత 35 సంవత్సరాల నుండి అనేక వేల కోట్ల రూపాయల లాభాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు లేకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఉద్దేశపూర్వకంగానే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నష్టాల్లోకి నెడుతూ, ప్రయివేటీకరణ మంత్రం జపిస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి, ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు కోడి లక్ష్మణ్, నోముల కొండ, పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం, కోరాడ బద్రి, బూడిద జోగేశ్వరరావు, పొన్నాడ మల్లేష్, పైలా ప్రసాద్, పైలా సత్తిబాబు, బోడసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో గ్రంథాలయం అవసరం

పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి


బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి పాఠశాలలో గ్రంథాలయం అవసరం ఎంతైనా ఉందని, కచ్చితంగా అంది ఏర్పాటు చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక చినఅమిరం జెడ్‌పి హైస్కూల్లో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా గ్రంథాలయ రీడర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం గోపీమూర్తి మాట్లాడుతూ ఇంటర్‌నెట్ వినియోగం ఎంత అందుబాటులోకి వచ్చినా ఉపాధ్యాయుడికి, పుస్తకానికి సాటి రావని అన్నారు. ప్రతి పాఠశాల, గ్రామంలోనూ గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు, ప్రజలకు పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచాలన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దటంలోనూ, విద్యార్థుల అభివృద్ధిలోనూ గ్రంథాలయాలు ప్రముఖపాత్ర పోషిస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేగేశ్న అనురాధ, ఎస్ఎంసి కోఆప్షన్ సభ్యులు వత్సవాయి సూర్యనారాయణరాజు, గ్రంథాలయ నిర్వాహకుడు సిహెచ్.ప్రసాదరావు, ఎ.తారకేశ్వరి, బొర్రా రామకృష్ణ, పరువు ప్రసాద్, జె.శకుంతల, బి.రాము, జి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనంగా 123 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదన

నాలుగు నెలల్లో 7,432 ఎపిక్ కార్డులు పంపిణీ - రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అదనంగా 123 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో ఓటరుగా నమోదు చేసుకున్న వారికి నాలుగు నెలలుగా 7,432 ఎపిక్ కార్డులను పంపిణీ చేశామన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. ఎన్నికల కమిషన్ నూతన నిబంధనల ప్రకారం ఒక్కో పోలింగ్ కేంద్రానికి గరిష్టంగా 1200 మంది ఓటర్లను మాత్రమే కేటాయించాల్సి ఉందని, గతంలో ఇది 1500 ఓటర్లుగా ఉండేదని తెలిపారు. ఈ నిబంధనను పరిగణనలోకి తీసుకుని జిల్లాలో ప్రస్తుతమున్న 1,461 పోలీస్ స్టేషన్లకు అదనంగా 123 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేశామని తెలిపారు. రెండు పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పునకు, ఒక పోలింగ్ స్టేషన్ పేరు మార్పుకు ప్రతిపాదనలను తయారు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది జనవరి ఆరో తేదీ నుండి నవంబర్ 19వ తేదీ వరకు ఫారం-6 కొత్తగా ఓటు పొందడానికి 3,334 మంది దరఖాస్తు చేసుకోగా, 2,800 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. వీటిలో 426 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారని, మరో 108 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఎన్నికల సెక్షన్ డిప్యూటీ తహశీల్దార్ మద్రాపు సన్యాసిరావు, ఆయా పార్టీల ప్రతినిధులు మరపట్ల శ్యాంబాబు (టిడిపి), జైశివ (జనసేన), బి.ధర్మారావు (వైసిపి), మురాల రత్నరాజు (బిఎస్‌పి) పాల్గొన్నారు.

అంగన్వాడీలకు గౌరవ వేతనం పెంచుతూ ఉత్తర్వులు

ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ సంస్థ పరిధిలో పని చేస్తున్న 70 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తల్లో పదో తరగతి ఉత్తీర్ణత చెందిన 59 మంది కార్యకర్తలను మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలుగా అప్‌గ్రేడ్ చేస్తూ, వీరి గౌరవ వేతనం రూ.7 వేలు నుండి రూ.11,500కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో సిఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ


విజేతలతో కరస్పాండెంట్, ప్రిన్సిపల్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో స్థానిక డాక్టర్ సిఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-17, అండర్-19 బాల బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎమ్‌డి.సలీంఖాన్ తెలిపారు. విజయవాడలోని పటమట హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 నెట్‌బాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఎం.ఎస్తేరు, పి.స్వాతి బాలికల విభాగంలో ప్రథమ స్థానం, ఎన్.విలియం, జి.త్రినాథ్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ధర్మాజీగూడెం క్రిసాలిస్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 15 నుండి 17వ తేదీ వరకు జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో డాక్టర్ సిఎస్ఎన్ కళాశాల క్రీడాకారులు టి.ఉమాభవాని, ఎం.బేబీరాణి, ఎన్.వెంకటరేష్మ, ఎం.ఝాన్సీ, డి.హరిణి ప్రియ, కె.రాములు కీలక పాత్ర వహించారు. అండర్-19 బాలుర విభాగంలో కె.హనూక్, స్టాండ్‌బైగా బి.రాజేష్, బాలికల విభాగంలో ఎం.బేబీరాణి, స్టాండ్‌బైగా ఎం.ఝాన్సీలక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి విజేతలైన క్రీడాకారులను, పీడీ దావూద్ ఖాన్‌ను డాక్టర్ సిఎస్ఎన్ కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ట్రెజరర్ వడుపు గోపీ, కళాశాల ప్రిన్సిపల్ ఎమ్‌డి.సలీంఖాన్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. చీడే సత్యనారాయణ చేతుల మీదుగా క్రీడాకారులకు మెడల్స్, కప్‌లు అందించి అభినందించారు.


చెరువును పరిశీలిస్తున్న రైతులు

యాంటీ బయోటిక్స్ వాడొద్దు

ఆక్వా రైతులకు శాస్త్రవేత్తల సూచన

ప్రజాశక్తి - నరసాపురం

ఆక్వా సాగు చేసే రైతులు యాంటీ బయోటిక్స్‌కు దూరంగా ఉండాలని శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ప్రభంజన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆక్వా యూనివర్సిటీ ఆధ్వర్యంలో రైతులకు రొయ్యల సాగుపై రెండో రోజు గురువారం రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. చాలామంది రైతులు అవగాహనా లోపం వల్ల సాగులో యాంటీ బయోటిక్స్ అధికంగా వాడుతున్నారన్నారు. దీనివల్ల రొయ్యల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. అనంతరం రైతులను సాగు చేసే చెరువు వద్దకు తీసుకెళ్లి అధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్.వీరభద్రరావు, కె.శ్రావణి పాల్గొన్నారు.

24 గంటల్లో ధాన్యం సొమ్ము జమ

మోగల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో

పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

రైతులు ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన 24 గంటల్లో సంబంధిత రైతు ఖాతాల్లో సొమ్ము జమ చేయడం జరుగుతుందని పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు అన్నారు. మోగల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన గ్రామ సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి, శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయకట్టు, ఉత్పత్తి అవుతున్న ధాన్యం, సాగు చేస్తున్న రైతుల వివరాలను నాగరాజు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ధాన్యం గింజనూ కొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. దళారుల వద్దకు వెళ్లి రైతులు మోసపోవద్దన్నారు. రైతుసేవా కేంద్రాల్లో పండించిన ధాన్యాన్ని అమ్మిన 24 గంటల్లో సొమ్ము ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. సర్పంచి కృష్ణకుమారి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకునే విధంగా తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొత్తపల్లి సూర్యనారాయణరాజు (బాబు), పాలకోడేరు సొసైటీ కార్యనిర్వహణాధికారి పివిఎల్.నరసింహారాజు, నాయకులు సందీప్‌వర్మ, సాంబ్రాణి సంకరుడు, శ్రీను, విజయ్‌కుమార్, జనార్దన్‌రాజు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి- భీమవరం

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి పూర్తిగా వెసులుబాటు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామ రాజు, ఎకెవి.రామభద్రం డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. 2010కి ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారికి టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. దీనికోసం సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున వెంటనే రివ్యూ పిటీషన్ వేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంతో కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయించాలని కోరారు. తగు విద్యార్హతలతో డిఎస్‌సి పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపికై దశాబ్దాల తరబడి ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తున్న వారిని ఇప్పుడు మరలా టెట్ పరీక్ష రాయాలనడం సరికాదన్నారు. విద్యాహక్కు చట్టంలో అవసరమైతే దీనిపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో సవరణ తేవాలన్నారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు యుటిఎఫ్ పోరాట కార్యక్రమాలు చేపడుతోందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 20 నుంచి 27వ తేదీ మధ్యలో లోక్ సభ, రాజ్యసభ సభ్యులకు చట్ట సవరణ చేసేలా ప్రయత్నించాలని వినతి పత్రాలు అందిస్తున్నామన్నారు. డిసెంబరులో డివిజన్, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. సుప్రీంకోర్టులో ఈపాటికి యుటిఎఫ్ భాగస్వామ్యంగా ఉన్న అఖిలభారత సంస్థ ఎస్‌టిఎఫ్‌ఐ ద్వారా రివ్యూ పిటీషన్ దాఖలు చేశామన్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పిటీషన్లు వేశాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటీషన్లు వేసి ఉపాధ్యాయులు ఆందోళన చెందకుండా టెట్ మినహాయింపు పొందేలా చూడాలని కోరారు.

తీరంలో పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్

ఆపరేషన్ కవాచ్ అని ఊపిరి పీల్చుకున్న జనం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గంలో గురువారం సముద్ర, గోదావరి తీర ప్రాంతాల్లో, బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రభుత్వాసుపత్రి, ఒఎన్‌జిసి టెంపుల్ ల్యాండ్, గోదావరి పంటు రేవు ప్రాంతంలో ఒక్కటే అలజడి.. ఎక్కడికక్కడే తీరప్రాంతం అంతా పెద్దఎత్తున మొహరించిన సివిల్, మెరైన్ పోలీసులు. మరోపక్క సముద్ర జలాల్లో కోస్ట్‌గార్డు పోలీసుల పహరా. దీంతో ఏం జరుగుతుందో తెలియక జనం కొద్దిసేపు అయోమయానికి గురయ్యారు. గురువారం సాయంత్రం నరసాపురం పట్టణంలోని బస్టాండ్ వద్ద పోలీసుల హడావిడి ప్రయాణికుల బ్యాగులు, అనుమానితులను తనిఖీ చేశారు. బస్టాండ్‌లో చొరబడిన ముగ్గురు అగంతకులు.. వారిని చాటుగా గమనించి చుట్టుముట్టిన పోలీసులు. ఇదంతా చూసిన ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొద్దిసేపటికి ఇదంతా ఆపరేషన్ కవాచ్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.

తీరప్రాంత ప్రజలు.. తీర ప్రాంత భద్రతకు పోలీస్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, కోస్టుగార్డు సిబ్బంది కలిపి సంయుక్తంగా నిర్వహించే ఈ మాక్‌డ్రిల్‌నే సాగర్ కవచ్ అంటారు. ఉగ్రవాదులు సముద్ర, రోడ్డు మార్గం ద్వారా దాడి చేయడానికి ప్రయత్నిస్తే వారిని ఎలా పట్టుకోవాలనే దానిపై సాగర్ కవచ్ అనే ఆపరేషన్‌ను నిర్వహించారు. నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద ఆధ్వర్యంలో కోస్టల్, మైరెన్, సివిల్ పోలీసులు సంయుక్తంగా ఈ డ్రిల్ చేశారు. ఈ డ్రిల్‌లో అంతర్వేది మైరెన్ సిఐ ఎ.నవీన్ నర్సింహమూర్తి, మెరైన్ ఎస్ఐ సోమశేఖర్‌రెడ్డి, ఎఎస్ఐ ఫాతిమా, సిబ్బంది పాల్గొన్నారు.

24న డిప్యూటీ సిఎం పర్యటన

ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురం రాక

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు


పవన్‌కళ్యాణ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ద్వారకాతిరుమల

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఈ నెల 24వ తేదీ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం రానున్నారు. గ్రామంలో కొలువై ఉన్న స్వయంభు శ్రీ లక్ష్మినరసింహాస్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. అనంతరం ఆలయ కొండపైకి వెళ్లేందుకు రూ.3.70 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. గ్రామంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్లను పరిశీలించనున్నట్లు తెలిసింది. జగన్నాథస్వామికి కేటాయించిన 30 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలను ఆయన దేవదాయ శాఖ అధికారులకు అప్పగించనున్నారు. డిప్యూటీ సిఎం పర్యటన ఏర్పాట్లల్లో అధికారులు నిమగ్నమయ్యారు. కొయ్యలగూడెం మండలం రాజవరం పెద్దచెరువు సమీపంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హెలీకాప్టర్ దిగిన అనంతరం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నరసింహాస్వామి ఆలయానికి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రోడ్డుమార్గం గుండా రానున్నారు. గురువారం జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, తహశీల్దార్ జివి.సుబ్బారావు, ఎంపిడిఒ పివివి.ప్రకాష్ ఏర్పాట్లను పరిశీలించారు.


బహుమతులు సాధించిన జక్కరం పాఠశాల విద్యార్థులు

చైతన్య కార్యక్రమాలతో బాలల్లో స్ఫూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు గ్రామీణ పాఠశాలలకు వచ్చి ప్రాథమిక పాఠశాల విద్యార్థులను చైతన్యవంతం చేసేందుకు చేపట్టిన కార్యక్రమాలు బాలల్లో ఎంతగానో స్ఫూర్తి నింపాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిన్నమరాజు రామరాజు తెలిపారు. జక్కరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ (యుబిఎ) ఆధ్వర్యంలో ప్రపంచ బాలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలకు మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్, పాటలు తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యుబిఎ సెల్ కోఆర్డినేటర్ జె.జీవన్ కుమార్, ప్రొఫెసర్ కెవి.గణేష్, జి.సూరిబాబు, ఉపాధ్యాయులు ఎస్‌వి అప్పలనాయుడు, పిఆర్‌విఎస్.సాయి వర్మ భూపతిరాజు, గీత పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక జెడ్‌పి హైస్కూల్లో ఐసిడిఎస్ ప్రాజెక్టు పాలకొల్లు సిడిపిఒ ఎం.ఉమ అధ్యక్షతన నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ పిల్లల హక్కులు, పిల్లల కోసం రూపొందించిన చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లంకలకోడేరు జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం రాజశేఖర్, పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ హరిబాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

పాలకోడేరు:భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ తెలిపారు. కళాశాలలో చదువుతున్న సోడిశెట్టి నవ్య తులసి, ఎర్రంశెట్టి రూపశ్రీ, పోతురాజు రామలక్ష్మి, పసుపులేటి మహాలక్ష్మి, నందివాడ అభిషేకమణి ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల నుండి ఆరుగురు చివరి రౌండ్ వరకూ వెళ్లగా వారిలో ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం విద్యార్థినులు మాట్లాడుతూ కళాశాలలో తమకు ఇచ్చిన తర్ఫీదు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల ఈ విజయం సాధించామని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్, అకాడమిక్ డీన్ కురెళ్ల భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళీకృష్ణ, కళాశాల యాజమాన్యం, హెచ్‌ఒడిలు ఉపాధ్యాయులు అభినందించారు.

గణపవరంలో ఫీవర్ సర్వే

గణపవరం:గణపవరం ఒకటో సచివాలయంలో గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు కె.ఓంకార్ నాద్, పి.కిరణ్మయి మాట్లాడుతూ జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరూ రక్తపరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. పరీక్షల ద్వారా మలేరియా ఉన్నదీ లేనిదీ తెలుసుకోవచ్చని చెప్పారు. వారంలో పరిసర ప్రాంతాలు పొడిగా ఉంటే దోమలు పెరగవని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, సిహెచ్.సత్యవతి, సిహెచ్.పద్మజ, హెల్త్ అసిస్టెంట్లు ఎంఎస్.యోహాన్, ఎం.నల్లయ్య, జి.కృష్ణంరాజు, ఆశాలు పాల్గొన్నారు.

వైసిపి కోడేరు యూత్ అధ్యక్షులుగా సుందర్‌రాజు

ప్రజాశక్తి - ఆచంట

యువత ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు కోటే శశిమధు, మండల యూత్ ప్రధాన కార్యదర్శి కోట గిరిధర్ అన్నారు. గురువారం కోడేరులో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో యువజన విభాగం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కోడేరు యూత్ అధ్యక్షులుగా లంకపల్లి సుందర్‌రాజును నియమించారు. కోటే శశిమధు మాట్లాడుతూ వైసిపి బలోపేతంలో భాగంగా అన్ని గ్రామాల్లో వైసిపి యూత్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 నెలల్లో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న రెడ్‌బుక్ పాలనకు స్వస్తి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రొక్కల బన్ను, మామిడిశెట్టి చిన్నా, దేవరపు సూర్యనారాయణ, బొంతు శ్రీను, ఎం.రెడ్డియ్య పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

వీరవాసరం :గుడ్ విల్ విజిట్ లో భాగంగా వీరవాసరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జోన్ ఛైర్ పర్సన్ పిఎంజెఎఫ్ ఎస్.వసంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం 500 స్టీల్ ప్లేట్లను వీరవాసం లయన్స్ క్లబ్ సమకూర్చింది. వీటిని మండలంలో శుభ కార్యక్రమాలు చేసుకునేవారు ఈ ప్లేట్లను వినియోగించుకుని శుభ్రపర్చి తిరిగి క్లబ్‌కు అందించే విధంగా ఏర్పాటు చేశారు. మండలంలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న 100 మంది విద్యార్థులకు లాంగ్ నోట్ పుస్తకాలను అందించారు. పాలకొల్లు లయన్స్ హాస్పటల్ వారి సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 147 మందికి వైద్య పరీక్షలు చేయగా 61 మందికి కళ్లజోళ్లు వీరవాసరం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పోలిశెట్టి సత్యనారాయణ ఉచితంగా అందించనున్నారు. 46 మందికి కంటి ఆపరేషన్లను పాలకొల్లు లయన్స్ హాస్పటల్ వారు ఉచితంగా చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలిశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి దేవిరెడ్డి పుల్లారావు, ట్రెజరర్ గొలగాని సత్యనారాయణ, పోలిశెట్టి శ్రీనివాస్, అందే శివశంకర్‌రావు, నూకల అప్పాజీ, వసంతాల భుజంగరావు, కూనపరెడ్డి నాని కొప్పినీడి శ్యామలరావు, శంకర్ హనుమాన్, శిరీష పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

పెనుమంట్ర:గ్రంథాలయాల్లో లభించే విలువైన పుస్తకాలన్నీ విద్యార్థులకు మంచి నేస్తాలని, ఈ సంపదను విద్యార్థులు వినియోగించుకోవాలని పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక కోరారు. గురువారం స్థానిక లైబ్రరీలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఉప సర్పంచి, ఆక్వా రంగ ప్రముఖులు భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి విలువైన బహుమతులను అందజేశారు. ఆర్‌వి జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎల్.శారద పాల్గొన్నారు.

పాలకొల్లు : శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశారు. అలాగే దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడుతూ మంచి పుస్తకం మంచి స్నేహితుని వంటిదన్నారు. వైస్ ప్రిన్సిపల్ సి.రవిశంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జూలియా సి.రవిశంకర్, పివి.రమణ పాల్గొన్నారు.

నరసాపురం: వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు రోజున ఆర్‌డిఒ దాసిరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ముందు విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. ఎంఇఒ పుష్పరాజ్యం, రాజ్యలక్ష్మి, శాస్త్రవేత్త సుబ్బారావు, లైబ్రరీ అధికారి కుమారి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభ స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కష్ణమోహన్, ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర డైరెక్టర్ పద్మనాభుని మురళి, ఎంపిడిఒ చంద్రశేఖర్, ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.లక్ష్మి సరోజా విచ్చేసి మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలి

కాళ్ల:సిఐటియు ఆల్ ఇండియా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఇర్రింకి ఏడుకొండలు కోరారు. సిఐటియు మండల కమిటీ సమావేశం దావులూరి మార్తమ్మ అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ ఏడుకొండలు మాట్లాడుతూ విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకూ జరుగుతున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభ జయప్రదం కావాలన్నారు. సిఐటియు జిల్లా కమిటీ గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ 10 గంటల పనిని రద్దు చేయాలని, 8 గంటల పనిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్ని కంపెనీల్లో చట్టం రాకమునుపే పది నుంచి 12 గంటలు అమలు చేస్తున్నారని, కార్మికులను బానిసలుగా చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న కంపెనీలపై లేబర్ డిపార్ట్మెంట్ దాడులు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు దాసరి వెంకటేశ్వరరావు, బాతు రామస్వామి, రాజామణి, గండికోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐటిఐ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - ఆచంట

వృత్తి నైపుణ్యం ద్వారానే మంచి ఉద్యోగాలు సాధించవచ్చని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట ప్రభుత్వ ఐటిఐ కాలేజీ ఆవరణలో గురువారం 2023-25 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కన్వొకేషన్ ధ్రుపత్రాలు, 2025లో చేరిన విద్యార్థులకు ఫ్రెషర్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్‌ఎ పితాని ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతి ప్రదానం చేశారు. ముందుగా మగ్గం డిజైనింగ్ వర్క్ నేర్చుకున్న మహిళలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ వృత్తి నైపుణ్యంతో విజయం సాధించిన విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థులు టెక్నికల్ కోర్సుల్లో చేరి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. టెక్నికల్ కోర్సు చదవడం ద్వారా ఉద్యోగంతో పాటు అవసరమైతే ఒక పరిశ్రమను స్థాపించి ఆ పరిశ్రమకు యజమానిగా ఉండొచ్చన్నారు. దుబాయిలో మంచి ఉద్యోగాలు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మిక శాఖా మంత్రిగా ఉన్న సమయంలో కాలేజీని ఏర్పాటు చేశానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు, ఎంపిపి డి.సూర్యకుమారి, ఎంపిడిఒ బి.కృష్ణమోహన్, తహశీల్దార్ జి.కనకరాజు, నెక్కంటి ప్రభాకర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పులూరులో కొనసాగిన వైద్య శిబిరం

ఉండి:ఉప్పులూరులో వైరల్ జ్వరాలు విజృంభించి పలువురు అనారోగ్యాల బారిన పడడంతో యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఐసి కీర్తన ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కీర్తన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైందని, దీనివల్ల గ్రామంలో దోమలు బెడద ఎక్కువై పలువురు అనారోగ్యాల బారిన పడ్డారని, తమకు సమాచారం రావడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామంలో బాధితుల కోసం మూడో రోజు వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన సర్వేలో జ్వరంతో బాధపడే వారు ఇంకెవరూ లేరని నిర్ధారించడం జరిగిందని వారు వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పంచాయతీ అధికారులు అప్రమత్తం కావడంతో ప్రస్తుతం ఉప్పులూరులో వైరల్ జ్వరాలు అదుపులోనే ఉన్నాయని తెలిపారు. ఇన్‌ఛార్జి పంచాయతీ అభివృద్ధి అధికారి జెవిటి.నాయుడు మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి దోమల నిర్మూలన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యండగండి పిహెచ్‌సి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం స్ఫూర్తిదాయకం

తాడేపల్లిగూడెం:అభివృద్ధి పనులకు ప్రజల భాగస్వామ్యం స్ఫూర్తి దాయకమని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కడకట్లలో నిర్మాణంలోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌కు వెంకట నరసింహ డవలపర్స్ భూపతిరాజు శివాజీ తరఫున గురువారం లోటాస్ ఎన్ క్లేవ్ ప్రతినిధి లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అభివృద్ధి కమిటీ వారికి అందించారు. ఈ సందర్భంగా లయన్ గట్టిం మాణిక్యాలరావు, లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడారు. అభివృద్ధి కమిటీ సభ్యులు నత్తి శివ అనిల్, డైమండ్స్ లయన్స్ వైస్ ప్రెసిడెంట్లు లయన్ కాళ్ల గోపీకృష్ణ, చెన్నారెడ్డి సతీష్, పేరిచర్ల వీరభద్రరాజు పాల్గొన్నారు.

అపహాస్యం చేసేలా జగన్ పాలన : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - అత్తిలి

గత వైసిపి ప్రభుత్వ హయాంలో హిందూ సంప్రదాయాలను అపహాస్యం చేసే విధంగా జగన్ పాలన చేపట్టారని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గతంలో తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో పాలకులు సైతం తిరుపతి లడ్డూను పూర్తిగా కల్తీమయం చేశారని విమర్శించారు. అత్తిలి మండలం బల్లిపాడు మదనగోపాల స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తిరుపతి లడ్డూలో రసాయనాలు వినియోగించి కల్తీ నెయ్యి వాడారని నిర్ధారణ అయ్యిందని తెలిపారు. దుర్మార్గమైన పాలన అందించిన వైసిపి నాయకులు, అప్పటి అధికారులు సైతం పరకాణిలో డబ్బులు సైతం నొక్కేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటికే తణుకు నియోజకవర్గంలో 11 దేవాలయాలకు సంబంధించి పాలకవర్గాలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. మదన గోపాలస్వామి ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షులు గారపాటి వెంకటసుబ్బారావు (బాబ్జి)తోపాటు కమిటీ సభ్యులను ఎంఎల్‌ఎ అభినంధించారు. ముందు బల్లిపాడులో సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్ ప్లాంటును ఎంఎల్‌ఎ ప్రారంభించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

సిపిఎం కార్యకర్తలు తమ సొంత ప్రయోజనం కంటే ప్రజా ప్రయోజనమే మిన్నగా ఎంచుకొని పనిచేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. గురువారం వేములదీవి పడమరలో పార్టీ సభ్యుల మండల స్థాయి శిక్షణ తరగతులు జరిగాయి. సీతారాం మాట్లాడుతూ దేశంలో సంపన్న వర్గాలు మతోన్మాదులతో కలిసి దేశ సంపదను లూటీ చేస్తున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల మధ్య అసమానతలు బాగా పెరిగాయన్నారు. అణగారిన ప్రజల్లో వస్తున్న అసంతృప్తులను, ఆందోళనలను అణచివేయడానికి పాలకవర్గాలు ప్రజల మధ్య కులం, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని విమర్శించారు. రాబోయే కాలంలో దోపిడీకి, పీడనకు, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎల్‌బి చర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - నరసాపురం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీరా స్వామి

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎల్‌బి చర్ల సొసైటీ ఛైర్మన్ గుబ్బల వీరాస్వామి అన్నారు. గురువారం ఎల్‌బి.చర్ల గ్రామంలో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభి మాట్లాడారు. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. గోనె సంచులు, కూలీల, రవాణా ఛార్జీలన్నీ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు సూచించిన మిల్లులకు ధాన్యం తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కటకంశెట్టి సంజీవరావు, గుబ్బల మార్రాజు, కంచర్ల ఫణికర్ పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

భీమవరం టౌన్:ఈ నెల 17న స్థానిక బస్టాండ్‌లో జరిగిన బంగారం చోరీ కేసును 48 గంటల్లో ఛేదించి ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 135 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని టిడ్కో ఇంటిలో నివాసముంటున్న కణితి ఆంజనేయులు బంగారం పని చేస్తున్నాడు. అయితే నర్సాపురంలోని జైన్ జ్యూయిలరీ షాపులో బంగారం ఇచ్చేందుకు ఈ నెల 17 తేదీన మధ్యాహ్నం వెళ్లేటప్పుడు బస్టాండ్‌కు వచ్చిన తర్వాత జేబులో పెట్టుకున్న బంగారం చోరీకి గురైన గుర్తించడంతో వెంటనే వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి సిఐ నాగరాజు ఆధ్వర్యంలో సిసి ఫుటేజ్ ఆధారంగా చోరీ పాల్పడిన వారిని గుర్తించారు. నూజివీడుకు చెందిన బంకురు కుమార్, మలుగుమాటి సుభాష్ ఇద్దరు నిందితులను 2019 జంక్షన్ రైల్వే స్టేషన్ లోని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.15 లక్షల విలువైన 135 గ్రాముల వడ్డాణం, లాకెట్లు స్వాధీనం చేసినట్లు తెలిపారు.ఎస్‌పి అభినందిస్తూ, కేసు పరిశోధనలో కీలక పాత్ర పోషించిన వన్ టౌన్ సిఐ ఎం.నాగరాజు, ఎస్ఐ మోహన్ వంశీ, హెడ్ కానిస్టేబుల్ యెహెూసువా, కానిస్టేబుల్ జీ. రామకష్ణ మరియు కానిస్టేబుల్ అడ్డాల శ్రీనుకు నగదు రివార్డులను అందించారు. ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

నరసాపురం:మండలంలోని వేములదీవికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. కె.బేతపూడికి చెందిన కుర్మ విజయకుమార్ (50) ఇటీవల తన బావమరిది ఇంటికి వచ్చారు. ఈ నెల 12న తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో నరసాపురంలో దిగారని, అప్పటి నుంచి ఆయన ఆచూకీ లభించలేదని బావమరిది ప్రభాకరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి వెల్లడించారు. విజయ్ కుమార్ ఆచూకీ తెలిసిన వారు 9848578781 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాయిదా

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా ఈ నెల 21న ప్రారంభమయ్యే 69వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు వాయిదా పడినట్లు ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాల బాలికల విభాగంలో నిర్వహించే ఈ పోటీలను తిరిగి డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో ప్రారంభమవుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పిఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు.

మొగల్తూరులో వైద్య శిబిరం

మొగల్తూరు:మొగల్తూరులోని వన మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో గౌరీ శంకర్ కార్పెంటర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో భీమవరానికి చెందిన మిత్ర మెడికేర్ వైద్యులు జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, చెవి, ముక్కు, గొంతు వైద్యులు, ఇసిజి, కంటి వైద్య నిపుణులు పలువురికి పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. శిబిరంలో మొగల్తూరులోని ఆర్‌ఎంపి, పిఎంపి వైద్యులు రాజేష్, ధనుంజయ్, రాంబాబు, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కుళాయి చెరువు వద్ద చెత్త వేయొద్దని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

తాగునీటి కుళాయి చెరువు వద్ద చెత్త వేయొద్దంటూ లాకుపేట, శ్రీహరిపేట, చలవపేట, పొన్నపల్లి వార్డుల ప్రజలకు గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ దాసిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెరువు వద్ద చెత్త వేయడంతో నీరు కలుషితంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఇటు చెత్తకు నిప్పు అంటించడం వల్ల పొగతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూళాయి చెరువు వద్ద చెత్త వేయకుండా చూడాలని ఆర్‌డిఒకు విన్నవించారు. కూనపురెడ్డి రామకృష్ణ, దిడ్ల రామకృష్ణ, బుంగా రమేష్, గుడాల సునీత, మల్లాడి మూర్తి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

పరిసరాల పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో డ్వాక్రా, ఐకెపి మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెంట్ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

వన సమారాధనలతో సమైక్యభావాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వికలాంగులు, అభాగ్యులు, అంధులు, బధిరులతో కార్తీక వన సమారాధన నిర్వహించడం భగవంతుడు మెచ్చే కార్యక్రమమని, కార్తీక వన సమారాధనలు సమైక్య భావాలు పెంపొందిస్తాయని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు సతీమణి సత్యవాణి అన్నారు. భీమవరం మార్కెట్ యార్డులో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వికలాంగులు, బధిరులు, అంధులు మానసిక వికలాంగులతో కార్తీక వన సమారాధన నిర్వహించి వారికి పండ్లు, భోజనాలు అందించారు. ఎఎంసి ఛైర్మన్ కలిదిండి సుజాత కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యవాణి మాట్లాడారు. 32 ఏళ్లుగా వీరందరితో ఇలాంటి సమారాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్న సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి అభినందనీయులన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అరుణోదయ మనోవికాస కేంద్రం, వెంకటేశ్వర బదిరుల పాఠశాల, రమణరాజు అంధ పాఠశాల, ఇమ్మానుయేల్ చిల్డ్రన్స్ హెూమ్, ప్రభుత్వ భవిత కేంద్రంలోని 500 మందికి భోజనాలు, పండ్లు, బహుమతులు దాతలు డాక్టర్ గౌతమ్ తనూజ, కలిగోట్ల సుబ్బరాజు, కట్టా నరసింహబాబు సౌజన్యంతో అందించామని తెలిపారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, కరూర్ వైశ్య బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యురాలు గంధం శ్రీదేవి పాల్గొన్నారు.

ఆచంట: ఆచంట రామేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక మాసం ముగింపు సందర్భంగా అమావాస్యను పరిష్కరించుకుని రామేశ్వరస్వామి నూతన కార్యవర్గం, గ్రామస్తుల సహకారంతో గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 6 వేల మంది యాత్రికులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్ఐ కె.వెంకటరమణ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ పర్యవేక్షించారు.

డంపింగ్ యార్డు ప్రక్షాళన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు నుంచి ఆచంట వెళ్లే రహదారిలో శ్మశానం వద్ద ఉన్న చెత్త డంపింగ్ యార్డుకు నిప్పు పెట్టి, తగల బెట్టడంలో స్థానిక పంచాయతీ సిబ్బంది ప్రమేయం లేదని సర్పంచి మట్టా కుమారీ రాము, కార్యదర్శి కె.సత్యనారాయణ గురువారం తెలిపారు. బుధవారం ప్రజాశక్తిలో వచ్చిన చెత్త కుప్పలో మంటలు వార్తకు స్పందించి, వెంటనే ప్రొక్లైనర్ రప్పించి డంపింగ్ యార్డులో చెత్తను తొలగించామని తెలిపారు. స్థానికంగా ఉన్న


చెత్త తొలగిస్తున్న దృశ్యం

ట్రాక్టర్, ఆటో సీట్ల తయారీ, సీట్ రిపేర్ షాపుల వారు ప్లాస్టిక్ కవర్ల రద్దును రాత్రి సమయంలో యార్డు వద్ద పోసి తగలబెతున్నారని తెలిపారు. పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. వారికి పంచాయతీ నుండి నోటుసులిచ్చినా వారి తీరు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎస్ఐ కె.స్వామి మాట్లాడుతూ సంబంధిత షాపుల యజమానులు, వర్కర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. ప్రజారోగ్యం విషయంలో ఈ చర్యలు ఎవరికైనా తగవని ఆయన పేర్కొన్నారు.

సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - తణుకు

గుండె పోటు వచ్చిన మొదటి కొన్ని నిమిషాల్లో సిపిఆర్ అందిస్తే ఆ వ్యక్తి బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రోటరీ గోల్డెన్ మినిట్స్ అంటారని డాక్టర్ కె.ప్రదీప్ ఇమ్మానియేలు అన్నారు. గురువారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ,పిజి (అటానమస్)లో తణుకు రోటరీక్లబ్ వారి ఆధ్వర్యంలో సిపిఆర్ అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ ఇమ్మానియేలు మాట్లాడుతూ గుండె తిరిగి కొట్టుకోవడం మొదలయ్యే వరకూ లేదా నిపుణులైన వైద్యుల సహాయం అందే వరకు సిపిఆర్ చేయాలని ప్రాక్టికల్ రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోటరీ క్లబ్ తణుకు అధ్యక్షులు డాక్టర్ కలగర వెంకటకృష్ణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా మెగా వైద్య శిబిరాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా సిపిఆర్ వంటివి నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, రోటరీక్లబ్ సెక్రటరీ జి.సుధాకర్, సౌజీప్రసన్న, వై.ఐశ్వర్య, దినేష్‌బాబు, కెవి శ్యామలాదేవి, సిహెచ్ రమేష్ పాల్గొన్నారు.